(7)

# ఆగిపోయిన కథ

"ఏది సుఖం ?" అని ప్రశ్నించుకొని, చాలాసేపు ఆలోచించాక "ఏదీకాదు," అని తనకు తనే సమాధానం చెప్పుకొన్నాడు లవణరాజు.

అతనిలాంటి నిర్ణయానికి రావడానికి చాలా కారణాలున్నాయి. ఒకప్పుడతనికి ధనముంటే అన్నిసుఖాలూ ఉన్నట్టే ననిపించింది. కాని, అనుభవంమీద అది నిజం కాదని తేలింది. ఎంత డబ్బున్నా, అది అధికారానికి లోబడే ఉంటుంది కనుక, అధికారం అనేది మనిషికి అమితానందాన్నిస్తుందని అతను రూఢిగా నమ్మాడు. అయితే, తండ్రి గతించాక, రాజ్యపాలనయావత్తూ అతని వశమయింది. మగధదేశానికి ఏకైకచక్రవర్తి అయ్యాడు. అతని పాలనకు లొంగి, ఎన్నో సామంతరాజ్యాలుకూడా ఉండేవి. అతను అన్నది వేదం; అతను చేసింది ఘనకార్యం. అతనిపలుకు శాసనం. ఒక్కచూపుతో, సౌజ్ఞతో అతనేమయినా చెయ్యగలడు. కాని, ఇందులోనూ సుఖంలేదని, అతనికి అనుభవంమీద తెలిసివచ్చింది.

కొంతకాలంపాటు లవణరాజు, "ఆనందమనేది అందంలో ఉంది" అనుకొన్నాడు. మహారాజుగా అతను— భువనమోహినిని భార్యగా చేసుకొన్నాడు. "నిజమైన ఆనందం ఇప్పుడనుభవిస్తున్నాను" అనుకొన్నాడతను. ఇందుకు తగినకారణంకూడా లవణరాజు సిద్ధంచేసుకొన్నాడు.

డబ్బూ, అధికారం అనేవి భౌతికమైన సుఖాన్నిచ్చేమాట నిజమేకావచ్చు. కాని, మనిషి – కేవలం భౌతిక సుఖాలతోనే సంతృప్తిపడి ఉండలేడు. కడుపునిండా అన్నంతినడం, కంటినిండా నిద్రపోవడం, కొన్ని లక్షలమందిని ఆజ్ఞాపించగలగడం – ఇవన్నీ సరే! కాని, వీటివల్ల మానసికానందం కలగదు. అయితే, కలుగుతుందని ఒకప్పుడు తను అనుకొన్న మాట నిజమే! ఇవన్నీ లేకపోయినా సుఖపడాలంటే–అందం కావాలి. దాన్నిచూసే నేర్పు, అనుభవించగల నైపుణ్యం కూడా కావాలి. గర్భదరిద్రుడైన చిత్రకారుడు, కవీ అంత సుఖంగా ఉండటానికి వారి సౌందర్యదృష్టే కారణమని సరిపెట్టుకొన్నాడు లవణరాజు.

అయితే, ఈ అభిప్రాయంతోనూ అత నాట్టేకాలం ఏకీభవించలేకపోయాడు. తనకు అందమైన భార్యఉంది. అయినా, ఆమెనుండి తను పొందగలిగినంత సుఖం పొందడం లేదు. దాంపత్యజీవితం ఆనందమయంగా ఉండాలంటే, భార్యాభర్తలు అనుకూలంగా ఉండటమొక్కటే చాలదు; వారిని కలిపి బంధించే ఏకైకసూత్రం ఒకటుండాలి. ఆ సూత్రం పిల్లలు. పిల్లలనేవారే లేకపోతే, భార్యా భర్తల అన్యోన్యతకు ఏకత్వంలేదు. కాబట్టి – నిజమైనసుఖం పిల్లల్లో ఉందిగానీ, మరోదాంట్లో లేదనుకొన్నాడు లవణరాజు.

కొంతకాలానికి లవణరాజుకు ఆ కోర్కెకూడా తీరింది. అతనికి ఒక కొడుకూ, ఆయిదేళ్ళతరవాత మరోకూతురూ కలిగారు. నిజాని కత నప్పుడు ఎంతో ఆనందించవలసింది.

కాని, అతగాడికి నిజమైన ఆనందం ఎందులో ఉంటుందో ఖచ్చితంగా తేలలేదు.

పిల్లలుపుట్టంగానే సరికాదు గదా! వారు బుద్ధిమంతులుకావాలి. బాగా చదువు సంధ్యలు నేర్చుకోవాలి. తనపేరు నిలబెట్టాలి. వారూ పేరు తెచ్చుకోవాలి. అంతదాకా వారిపుట్టుక ఆనందదాయకం కాదు. మూర్ఖులు పిల్లలు పుట్టగానే సంతోషిస్తారు. జ్ఞానులు మరోబంధం వచ్చిపడిందని విచారిస్తారు. గౌతమునివంటివాడు, యశోధర పుత్రుణ్ణి కన్నదన్న వార్తవిని 'నాకు మరోబంధం చుట్టుకొన్నదన్నమాట' అన్నాడు. ఆ ఉద్దేశంతోనే కొడుక్కు 'రాహులుడు' అన్న పేరుగూడా బెట్టాడు. తనకు బిడ్డలుకలగడం సంతోషించదగ్గవిషయమే! కానీ, వీరు తనపేరు నిలబెట్టాలిగదా! అప్పుడే గదా తను నిజంగా ఆనందించవలసింది?

లవణరాజు అనుకొన్నట్టుగా, అన్నీ సక్రమంగా జరిగాయి. విజయుడు పదిహేనుసంవత్సరాలపాటు గురుకులవాసంచేసి, సమస్తవిద్యలూ నేర్చుకొని రాజధానికొచ్చాడు. అరవిందగూడా సంగీత సాహిత్యాలలో మేటి అనిపించుకొంది. నిజానికిప్పుడు లవణరాజు ఆనందించడానికెలాంటి అభ్యంతరమూ ఉండకూడదు. అయితే, భగవంతుడు అతనికా అవకాశాన్నివ్వదలుచుకోలేదు. విజయునికి వివాహంచేసి, రాజ్యభారం అప్పగింతామనుకొన్న లవణరాజుకు, విజయుని వివాహం కొరకరాని కొయ్యకెంద తయారయింది. ఎంచేతనంటే-విజయుడు తనకిప్పుడుపెళ్లే అవసరంలేదన్నాడు. తనకునచ్చినపిల్ల దొరికిందాకా తను పెళ్ళాడనన్నాడు. దిక్కు

మాలిన రాచవంశ మర్యాదలకుపోయి బ్రతుకును ధ్వంసం చేసుకోవడం, తనకు ఏమాత్రం ఇష్టంలేదన్నాడు. తనకు నచ్చినావిడ ఏకులంలోఉన్నా చేసుకోవడానికి సిద్ధంగాఉన్నా నన్నాడు. లవణరాజు అన్నిటికీ ఒప్పుకొన్నాడు. 'నీ ఇష్ట ప్రకారమే కానివ్వ' మన్నాడు. అందుకోసం కావలసినసమస్త ఏర్పాట్లూ చేశాడుకూడా!

దురదృష్టవశాత్తూ విజయునికి ఏపిల్లా నచ్చలేదు. అతడి భవనంనిండా ఆడపిల్లల చిత్రాలు గుట్టలుగుట్టలుగా పడి ఉన్నాయి. చాలామంది స్వయంగా అతన్ని కలుసుకొని, ముఖాముఖి సంభాషించికూడా చూశారు. అయినా, పీస మెత్తులాభం కనిపించలేదు.

దాదాపు మూడుసంవత్సరాలపాటు జరిగిన ఈ అన్వే షణా సంరంభంవల్ల తేలిందేమిటంటే—విజయుడు పిచ్చి వాడనీ, అతని కసలు అందమంటే తెలియదనీ, అదికారణం గానే లోకోత్తర సౌందర్యరాసులను అతను గుర్తించలేక పోయాడనీ, అలాంటి జడుణ్ణి చేసుకొని- బ్రతుకును దుఃఖ భాజనంచేసుకోవడం వెర్రితనమనీ, లవణరాజైనా కొడుకు పెళ్లిప్రయత్నాలు మానడం ఉచితమనీ అంతా అను కొన్నారు.

సరిగ్గా ఆ సమయంలోనే లవణరాజు "ఏదీ సుఖం?" అని ప్రశ్నించుకొని, చాలాసేపు ఆలోచించాక "ఏదీ కాదు" అని తనకు తనే సమాధానం చెప్పుకొన్నాడు. అతన్నో విధమైన జడత్వం ఆవరించింది. ఎప్పుడు చూసినా దిగులుగా

కనిపించేవాడు. రాచకీయాల్లో పాల్గొనడం మానేశాడు. అన్ని వ్యవహారాలూ మంత్రులపరంచేసి, తనుమాత్రం అంతఃపురంలోనే ఉండిపోయేవాడు.

ఈవిధంగా మరికొంతకాలంజరిగితే రాజ్యంలో అల్లకల్లోలాలు తప్పవనుకొన్న మంత్రులు, లవణరాజునూ, విజయుణ్ని సంప్రదించాక, ఒక పద్ధతిని రూపొందించారు.

ఆ పద్ధతిప్రకారం విజయుడు ఒకానొక శుభముహూర్తాన, ఆరుబయట నిలబడి నాలుగుదిక్కులకు నాలుగు పావురాలను ఎగరేస్తాడు. ఎవరికైతే ఆ పావురాలుచిక్కుతాయో, వారిని అతగాడు పెళ్ళాడాలి. ఒక వేళ నలుగురికీ చిక్కడమే జరిగితే నలుగుర్నీ భార్యలుగా చేసుకొనితీరాలి. అసలెవ్వరికీ చిక్కకపోతే, అలా బ్రహ్మచారిగానే ఉండిపోవాలి. ఆ తరవాత లవణరాజుగానీ, మరొకరుగానీ, విజయుణ్ని పెళ్ళాడమని అడగకూడదు.

ఈ విషయాన్ని అతి గోప్యంగా వుంచాలి. ఎందుకంటే- విజయుణ్ని పెళ్ళాడాలన్న కాంక్షకొద్దీ, ఎవరైనా పావురాలను ప్రయత్నపూర్వకంగా పట్టుకొనే అవకాశం ఉంది. మోసం జరగడానికిగూడా బోలెడంత వీలుంది. ఇలాంటి గొడవలేమీ జరక్కుండా ఉండేందుకూ, పథకం వీలయినంత న్యాయసమ్మతంగా ఉండేందుకూ, దాన్ని రహస్యంగా వుంచడంతప్ప మరోగత్యంతరంలేదు. అయితే, పావురాలు నిజంగా ఎవ్వరికి దొరికాయో తెలుసుకొనేందుగ్గాను

అన్నిచోట్లా సమ్మోకస్తులైన రాజభటులు ఛద్మవేషాల్లో ఉంటారు.

ఇదీ ఆ ఏర్పాటు...

ఇందులకు లవణరాజు, విజయుడుగూడా అంగీకరించారు. ఈ విధానానికి విధిగా కట్టుబడిఉంటామనీ, ఫలితం ఎలాంటిదైనా సహృదయంతో స్వీకరించడానికి సంసిద్ధమేననీ, ఇందుకు తప్పినవారిని తీవ్రశిక్షకు పాల్పడచేయవచ్చుననీ, కులదేవతముందు తండ్రీ – కొడుకులిద్దరూ శపథం చేశారు. ఏదోవిధంగా, ఈ సమస్య పరిష్కారమవుతున్నందుకు ఇద్దరూ సంతోషించారుగూడా.

అనుకొన్నప్రకారం, ఒకానొక శుభముహూర్తాన విజయుడు, లవణరాజు, ముఖ్యమంత్రులు, విజనప్రదేశం చేరుకొన్నారు. విజయుడు భగవంతుణ్ణిధ్యానించి, నాలుగు దిక్కులకూ నాలుగు పావురాలను ఎగరవేశాడు. ఓసారి పల్టీలుకొట్టి, రెక్కలు టపటపలాడించుకొంటూ పావురాలు, వాయుగర్భంలోనికి చొచ్చుకుపోయాయి. వాటికేసి చూసి, గాఢంగా నిశ్వసించాడు విజయుడు. ఆ తరవాత అందరూ రాజధానికి తిరిగివచ్చారు.

— సాయంత్రానికల్లా, రాజభవనంలో సెగలూ - పొగలూ రేగాయి. భయంకరమైన పీడనీడలేవో రాజభవనం మీద ముసురుకొన్నాయి. మృత్యుసదృశ్యమైన జడత్వం అంతటా వ్యాపించిపోయింది. మనుషుల ముఖాలలో ఆందో

శన, భయోద్విగ్నత గోచరిస్తున్నవి. మంత్రించినట్టుగా నీరవ నిస్తబ్ధతల కాలవాలమయింది రాజభవనం !

ముందుగా లవణరాజు ఆశ్చర్యపోయాడు. కారణ మేమిటని సేవకుల నడిగాడు. సేవకులు ఒకరి నొకరు చూసు కొని తలలు దించుకొన్నారు.

"ఏమయింది ?" అన్నాడు లవణరాజు

"అరవింద—" అన్నమాట సన్నగా ఎక్కడినించో వినిపించింది.

"అరవిందకేమయింది?" అంటూ లవణరాజు, చర చరా కూతురుగదికేసి నడిచాడు. నిజానికి అరవిందకేమీ కాలేదు. ఆమె తూగుటుయ్యాలలో అలవోకగా కూచుని ఉంది. ఉత్సాహంతో సన్నగా పాటకూడా పాడుకొంటూ ఉంది. మధ్యమధ్య రెండుచేతుల్లోనూ, పావురాన్ని ముద్దు లాడుతూ ఉంది. పావురం కదిలినప్పుడల్లా, బంగారపుటందె "గల్లు - గల్లు" మంటోంది. ఆ అందెను గుర్తుకోసం తనే తొడిగాడు !

*　　　*　　　*

ఇంతటితో ఆగిపోయింది కథ. ఆ తరువాత భాగం కోసం పెట్టెనంతా వెదికానుగాని కనిపించలేదు. దాదాపు మూడు నాలుగు సంవత్సరాల క్రిందట రాసి పెట్టెలో పడే శానేమో, అడుగు కాగితాలు కలిపించాయిగాదు. పోనీ- ఇప్పుడుకూచుని, మిగతాభాగం పూర్తిచేదామనుకొన్నాను. అయితే, ఎలా ముగింపుచేయడమో తోచిందికాదు. ఇందు

కోసం కొన్ని రాత్రులకు రాత్రులు ఆలోచించానుగానీ, ముగింపు చేయడంమాత్రం తట్టలేదు. ఒకప్పుడయితే ఎలా చేసిఉంటాననీ, ఎలాచేస్తే లబ్జుగా ఉంటుందనీకూడా ఆలోచించగా ఆలోచించగా నా కింకో అనుమానంకూడా కలిగింది. అప్పుడయినా ఈ కథను పూర్తిగా రాసిఉంటానాఅని! అలా రాయడమే జరిగితే, దాన్ని పెట్టెలో ఎందుకు పడేశానాఅని! అయితే దేన్నీ కడముట్టా చూడకుండా, మధ్యలో వదలడం నా కలవాటులేదు మరి! ఇన్నిటికీ ఈ కథ ఇంతటితో ఆఖరయినట్టా-కానట్టా? ఈసమస్య లన్నింటికీ నేను సంతృప్తికరమైన సమాధానాలు చెప్పుకోలేకపోయాను. అలా చెప్పుకోగలిగినప్పుడే పాఠకుల కిద్దామనుకొని, తిరిగీ దాన్ని పెట్టెలో పడేశాను.